క్లుప్తంగా

కరాటేలో భాష్యం విద్యార్థుల ప్రతిభ



కరాటేలో సత్తా చాటిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

గుంతకల్లు: ఆంధ్రప్రదేశ్ కరాటే అసోసియేషన్, ఏపీ మార్షల్ ఆర్ట్స్ ఆకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో గుంతకల్లు భాష్యం హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పోట్లీలో పాఠశాలకు చెందిన విద్యార్థులు మూడు గోల్డ్, నాలుగు సిల్వర్ మెడల్స్‌తోపాటు 6 బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపాల్ భార్గవి తెలిపారు. పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను బుధవారం అభినందించి ప్రశంసాప్రతాలను అందజేశారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ రామకృష్ణ, రాయలసీమ జోన్ సీఈఓ అనిల్ ప్రత్యేక అభినందించినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో పీఈటీ మాధవి, సురేష్, కరాటే మాస్టర్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గీతా జయంత్యుత్సవాలు ప్రారంభం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం గీతా జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా దేవస్థాన కలశ స్థాపన, భగవద్గీత పారాయణం నిర్వహించారు. అనంతరం ఆలయ యాగశాలలో గీతా హోమాన్ని చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఇళ్లు లేని నిరుపేదలు దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు: మండలవ్యాప్తంగా ఇళ్లులేని నిరుపేదలు ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ సుప్రజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎంఏవై కింద డిసెంబర్ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పొజిషన్ సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, ఆదాయ, కుల ధ్రువపత్రాలు, ఆధార్ నంబర్లు భార్యభర్తలవి, భార్య బ్యాంకు అకౌంటు, జాబ్‌కార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ ఏఈ సూచించారు.

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ



సబ్ జైలును తనిఖీ చేస్తున్న డీఎల్ఎస్ఏ సెక్రెటరీ శివప్రసాద్ యాదవ్

గుత్తి: పట్టణంలోని స్పెషల్ సబ్ జైలును బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి శివ ప్రసాద్ యాదవ్, గుత్తి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ఏడీజే శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు జైల్లోని బ్యారెక్‌లు, టాయిలెట్లు, వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. జైలు ఆవరణలో కంపోస్టు ఏర్పాటు చేయాలని జైలర్ మహేశ్వరుడుని ఆదేశించారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు సూర్యనారాయణ, నరసింహనాయుడు, కోర్టు సిబ్బంది సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు

యాడికి: అనుమతులు లేకుండా చెరువు మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డీఈ రామ్మోహన్ హెచ్చరించారు. టీడీపీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి రాయలచెరువు గ్రామంలోని చెరువులో అనుమతులు లేకుండా రెండు రోజులుగా జేసీబీతో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తూ రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నాడు. సమాచారం అందుకున్న ఇరిగేషన్ సిబ్బంది బుధవారం చెరువు వద్దకు వెళ్లి మట్టిని తవ్వుతున్న జేసీబీ, మట్టి తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. అధికారులు మందలించడంతో టీడీపీ నేతలు తమ వాహనాలను చెరువులో నుంచి బయటకు పంపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుంటామని ఇరిగేషన్ డీఈ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

యల్లనూరు: గిర్రమ్మబావి సమీపంలో ఆటో బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. పుట్లూరు మండలం గోపరాజుపల్లికి చెందిన 10 కూలీలు వ్యవసాయ పొలాలకు కంచె వేసేందుకు ఆటోలో సింహాద్రిపురం వద్ద ఉన్న బలపనూరుకు బయలుదేరారు. గిర్రమ్మబావి వద్దకు రాగానే ఆటో అదుపు తప్పి కిందపడింది. అందులో ప్రయాణిస్తున్న గోపాల్‌తోపాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పట్టించుకునే వారేరీ?

- సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యం
- మూడు నెలలుగా హాజరు పట్టికలో సంతకాలు చేయని వీఆర్వో
- ఏదో ఒక సాకుతో బయట తిరుగుతున్న సిబ్బంది
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



పెద్దమల్లేపల్లి సచివాలయం



హాజరుపట్టికలో అసంపూర్తిగా ఉన్న వీఆర్వో సంతకాలు

యల్లనూరు: అధికారుల పర్యవేక్షణ లోపంతో సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపన 2019లో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాయల వ్యవస్థను ఏర్పాటు చేశారు. మండలంలో 21 పంచాయతీలు ఉండగా 14 సచివాలయాలు ఉన్నాయి. వాటిలో 121 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. సచివాలయాల ద్వారానే దాదాపు 500కు పైగా సేవలందిస్తున్నారు. దీంతో ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండానే అన్ని సేవలు పొందేవారు. ప్రభుత్వం కూడా సచివాలయాలపై నిత్యం పర్యవేక్షణ జరిపేది. దీంతో సచివాలయ సిబ్బంది కూడా అలాగే పని చేసేవారు.

పర్యవేక్షణా లోపం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థ పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో అధికారులు కూడా వాటి నిర్వహణపై పెద్దగా దృష్టి సారించడం లేదు. ఫలితంగా సచివాలయ సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాట తయారైనట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పెద్దమల్లేపల్లి సచివాలయంలో వీఆర్వో సూర్యప్రకాష్‌రెడ్డి 3 నెలలుగా హాజరుపట్టికలో సంతకాలు చేయలేదు. అలాగే ఏఎన్ఎం చంద్రకళ (మెడికల్ లీవ్) పెట్టింది. ఏఎన్ఎం హాజరుపట్టికలో ఆగస్టు 6 వరకూ సంతకం చేశారు. 7వ తేదీ నుంచి హాజరుపట్టికలో సంతకం చేయలేదు. కాని ఆగస్టు 12 నుంచి డిసెంబరు 13 వరకు మెడికల్ లీవ్ పెట్టినట్లు డీడీఓ పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు లెటర్ అందించారు. అయితే ఆగస్టు ఏడో తేదీ నుంచి ఉండాల్సిన లీవ్ లెటర్ 12 నుంచి ఉండటం చర్చనీయాంశంగా మారింది. ప్రతి సచివాలయంలో ఒక్క ఉద్యోగిని మాత్రమే సచివాలయంలో కూర్చోబెట్టి మిగిలిన ఉద్యోగులు ఏదో ఓ సాకుతో బయట తిరుగుతున్నారు. అలాగే వీరిని చూసుకొని మిగిలిన సచివాలయ ఉద్యోగులు ఆదే బాట పడుతున్నారు. సచివాలయాల్లో ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఏదైనా ఉద్యోగుల సంతకాలు కావాలంటే వారు ఉన్న చోటికి వెళ్లి పెట్టింకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనను ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటా



సచివాలయాల ఉద్యోగుల హాజరుపట్టికను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. సమయపాలన పాటించాలి. అలా చేయని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం. నిర్లక్ష్యంగా ఉన్న ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తాం. ప్రతి వారంలో ఒక రోజు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు సిద్ధమవుతున్నాం.

– ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, యల్లనూరు

రైతుల సమస్యలపై పోరుబాటకు తరలిరండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ నారాయణ

శింగనమల: రైతుల పట్ల కూటమి ప్రభుత్వం అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వి నారాయణ మండిపడ్డారు. బుధవారం శింగనమలలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 13న రైతుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అనంతపురంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు భారీ తరలిరావాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఎన్నికల హామీలు అమలు చేయలేదన్నారు. గతంలో అకాల వర్షాలతో పంటలు నష్టపోతే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకున్నారన్నారు. కాని కూటమి ప్రభుత్వంలో అకాల వర్షాలతో పంటలు నష్టపోతే రైతులను పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. గతంలో పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేదని, కాని నేడు కూటమి ప్రభుత్వంలో రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించాల్సి దుస్థితి నెలకొందన్నారు. వైఎస్ జగన్ హయాంలోనే రైతు భరోసా కింద ఏటా రూ.13,500 సాయాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసేవారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు పైసా సాయం కూడా అందించడం లేదన్నారు. ఈకూటమి ప్రభుత్వం రైతులను నిలువనా మోసం చేస్తోందన్నారు. పోరుబాట కార్యక్రమానికి రైతులు పార్టీలకతీతంగా తరలివచ్చి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని పిలుపునిచ్చారు. ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు నవీన్ కుమార్, భాస్కర్‌రెడ్డి, వెంకటప్ప, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి నాగ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఈఓఆర్డీ శివాజీరెడ్డి

యల్లనూరు: గ్రామాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఎంపీడీఓ వాసుదేవరెడ్డి కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో చేయవలసిన పనులపై అవగాహన కల్పించారు. ఈఓఆర్డీ మనోహర్, సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, వనం శారద, ఓబులమ్మ, నారాయణస్వామి, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, ఆదాయం, లక్ష్యాల సాధనపై వివరించారు. కార్యదర్శులు ధనలక్ష్మి, సుమలత, వెంకటేష్, సర్పంచ్ లావణ్య, శిక్షకుడు శ్రీధర్‌గౌడ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

పామిడి: ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం ఎంపీడీఓ కే తేజోత్సు ఆధ్వర్యంలో అధికారులు, అనధికారులు, ప్రజా ప్రతినిధులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈఓఆర్డీ కృష్ణకుమార్, మండలస్థాయి అధికారులు, అనధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అన్నదాతల సమస్యలపై నిర్లక్ష్యం



విలేకరులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ భాస్కర్

బుక్కరాయసముద్రం: అన్నదాతల సమస్యలపై కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వైఖరి అవలంభిస్తోందని వైఎస్సార్ సీపీ నేత, జెడ్పీటీసీ నీలం భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రలోని మహానేత వైఎస్సార్ విగ్రహం ఎదుట మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయంగా మంజూరు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు పైసా కూడా పరిహారం అందించలేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో రైతులు దిక్కుతోచనిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనకు ఉదయం మండల కేంద్రం నుంచి బైక్ ర్యాలీగా జిల్లా పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకుంటామన్నారు. మండలంలోని రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెన్నంపల్లి వెంకటరెడ్డి, పెద్దకొండయ్య, చంద్రమోహన్, శ్రీనివాసరెడ్డి, ఎర్రిస్వామి, సాకే లక్ష్మి నారాయణ, పూల రంగ, సాయి, రవి, నిమ్మల భాస్కర్, రామంజినేయులు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



పోస్టర్లను విడుదల చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన అన్నదాతలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు సుంకప్ప విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ నెల 13న అనంతపురంలో నిర్వహించనున్న అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతన్నలను నట్టేట ముంచిందన్నారు. అధికారం చేపట్టి ఆరునెలలైనా సూపర్‌సిక్స్ హామీల అమలులో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఆపదలో ఉన్న రైతన్నలను ఆదుకోవడానికి తక్షణమే రైతు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇవ్వాలని, ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించాలన్నారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. రైతన్నల సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమాలు కొనసాగిస్తూనే ఉంటామన్నారు. జగనన్న ఆదేశాల మేరకు రైతు వ్యతిరేకిగా మారిన కూటమి ప్రభుత్వం మెడలు వంచేందుకు 13న చేపడుతున్న ర్యాలీకి నియోజకవర్గంలోని రైతులు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ భీమలింగప్ప, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, వార్డు ఇన్‌చార్జ్‌లు వీరేష్, సంపత్, పరుశురాముడు, ముఖ్య నాయకులు ఎండీ.ఖలీల్, రాము, ఆర్‌డీజే.బాషా, హాజీ, బాసిద్, షాబుద్దీన్, మోతేమస్తాన్, వెంకటేశులు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను త్వరగా పరిష్కరిస్తాం



సోదనపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

శింగనమల: గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. బుధవారం సోదనపల్లిలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై గ్రామాల్లో ఘర్షణలు పడొద్దని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వరకుమార్, డిప్యూటి తహసీల్దార్ పునీత్‌బాబు, వీఆర్వో శ్రీధర్‌రావు, ఎండోమెంట్ అధికారి గురప్ప, నరసింహులు, నాగేంద్ర, వెంకటమ్మ, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి, పి.ఎర్రగుడి గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సులకు తహసీల్దార్ ఓబిలేసు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలతలు హాజరై రైతుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. రెవెన్యూ సదస్సులలో రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సూచించారు. ఆయా సదస్సులలో 14 మంది రైతులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పాపన్న, సుమలత, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, వీఆర్ఓలు సురేంద్ర, కిశోర్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

గుంతకల్లు రూరల్: ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ కృషి చేయాలని ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నూతనంగా ఏర్పాటైన నేపథ్యంలో బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీఓ, డీఎస్పీ ఏ.శ్రీనివాస్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, నాన్ ఆఫీషియల్ సభ్యులు సాకే గోవిందు, మల్లికార్జున, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ, డీఎస్పీ మాట్లాడుతూ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్సీ,ఎస్టీ కాలనీలు, గ్రామాల్లో ఇప్పటివరకూ పెండింగ్‌లో ఉన్న కేసులు, ఇతరత్రా సమస్యలను తెలుసుకోవడంతోపాటు వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు సమయంలో బాధితులు చెప్పే వివరాలను ముందు పూర్తిగా వినగలిగితే కేసులో ఉన్న నిజానిజాలు తెలుసుకోగలమని చెప్పారు. నాన్ ఆఫీషియల్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌ను అమలులోకి తీసుకువచ్చినప్పటికీ ఇప్పటికీ సరైన అవగాహన లేదన్నారు. ఎస్సీ, ఎస్టీల పరిస్థితి గ్రామాల్లో మరింత దయనీయంగా ఉందన్నారు. రచ్చకట్టలపై కూర్చోనివ్వకపోవడం, హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి, ఎస్సీ,ఎస్టీలపై తక్కువ చూపు వంటివి నేటికి కొనసాగుతున్నాయన్నారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో నిజమైన బాధితులకు న్యాయం జరగడం లేదనే భావన ఎక్కువగా ఉందన్నారు.

పశు గర్భకోశ చికిత్స శిబిరం

గార్లదిన్నె: క్రిష్ణాపురంలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఆ శాఖ డీడీ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం వాడడం వల్ల 90 శాతం ఆడదూడలు పుడతాయని,కేవలం 10 శాతం మాత్రమే మగ దూడలు పుట్టే అవకాశం ఉందన్నారు. రైతులు తమకు కావాలసిన జాతుల వీర్యం ఎంపిక చేసుకోవచ్చన్నారు. అనంతరం 36 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. యర్రగుంట్ల పశువైద్యశాల డాక్టర్ ఆంజనేయులు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న ఉమాబాయ్ బుధవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో విష ద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించింది. గొంతు వాపుతో ఇంట్లో ఉన్న ఉమాబాయ్‌ని గుర్తించిన కుటుంబ సభ్యులు తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆ తర్వాత వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు. కుటుంబ సమస్యల కారణంగానే ఆమె ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు.

వీల్‌చైర్స్ అందజేత



ఆలయ ఈఓ కే.వాణికి వీల్‌చైర్స్ అందిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

గుంతకల్లు రూరల్: కర్నూలుకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు బుధవారం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి వీల్ చైర్స్‌ను బహూకరించారు. స్వామివారి దర్శనార్థం ఆలయానికి వచ్చే వికలాంగులు, వృద్ధుల సౌకర్యార్థం వీల్‌చైర్స్‌ను అందిస్తున్నట్లు సొసైటీ చైర్మన్ కేజీ గోవిందరెడ్డి, మాజీ చైర్మన్ జీ.శ్రీనివాస్, కోశాధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దాతల పేరున ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈవో కే వాణి సొసైటీ సభ్యులను అభినందించారు.

రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోండి

గుంతకల్లు రూరల్: అక్రమాలకు పాల్పడుతున్న రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ కార్యదర్శి బీ.సురేష్ బుధవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం పంపిణీ తూకాల్లో డీలర్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. పట్టణంలో దాదాపు 70 మందికి పైగా రేషన్ డీలర్లు ఒక్కో కార్డు మీద 3 కిలోల బియ్యాన్ని తక్కువ వేస్తున్నారన్నారు. కందిపప్పు సరఫరా ఉన్నా కొంతమందికి మాత్రమే ఇచ్చి మిగిలిన దాన్ని బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారన్నారు.

మాజీ సర్పంచుకు తీవ్ర గాయాలు

యాడికి: రాయలచెరువు–కిష్టిపాడు మధ్య బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచు అనసూయమ్మకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..రాయలచెరువుకు చెందిన మాజీ సర్పంచు అనసూయమ్మ కుటుంబ సభ్యులతో కలిసి గుత్తిలో వివాహం చూసుకుని కారులో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీ కొనింది. ప్రమాదంలో అనసూయమ్మ తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను అస్పత్రికి తరలించారు.

వారోత్సవాలు జయప్రదం చేయండి

గుంతకల్లుటౌన్: జనవరి 3న కర్నూలు జెడ్పీ హాల్‌లో జరిగే చదువుల తల్లుల జయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి కోరారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం జయంతి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. దేశ తొలి మహిళా ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్ జయంతి ఉత్సవాలకు భారీగా తరలిరావాలని వారు కోరారు. సంచారజాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్, జిల్లా కార్యదర్శి భీమలింగ తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దాడి హేయం

పామిడి: హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద న్యూస్ కవరేజ్‌కు వెళ్లిన మీడియాపై సినీనటుడు మోహన్ బాబు దాడి చేయడం హేయమైన చర్య అని పామిడి వర్కింగ్ జర్నలిస్టులు అన్నారు. బుధవారం జర్నలిస్టు గద్దల మల్లికార్జున ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ జీ లక్ష్మినారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

14న సాగునీటి సంఘం ఎన్నికలు

యల్లనూరు: మండలంలో ఈనెల 14న సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు పీబీసీ ఏఈ హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యల్లనూరు, కల్లూరు, తిరుమలాపురం, వేములపల్లి పంచాయతీల్లో ఉదయం 8 సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈసందర్భంగా సాగునీటి సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారని, సంఘంలో 12 మంది సభ్యులుగా ఉంటారన్నారు. 13న తహసీల్దారు కార్యాలయంలో పీఓలు, ఏపీఓలకు సమావేశం ఉంటుందన్నారు. యల్లనూరు(ఏఓ రామకృష్ణుడు), కల్లూరు(ఎంపీడీఓ వాసుదేవరెడ్డి), వేములపల్లి (ఎంఈఓ చంద్రశేఖర్), తిరుమలాపురం (ఈఓఆర్డీ మనోహర్) ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ జరుగుతుందన్నారు.

భారత్ గ్యాస్ నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

యాడికి: గ్యాస్ సిలిండర్లు సరిగా సరఫరా చేయని భారత్ గ్యాస్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ చెన్నప్ప బుధవారం డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెన్నప్ప మాట్లాడుతూ గ్యాస్ కోసం బుక్ చేసి రోజులు గడుస్తున్నా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయడం లేదన్నారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను అడిగినా స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు శివప్రసాద్, ఆదినారాయణ, భీముడు పాల్గొన్నారు.

పోలీసుల సమస్యలు పరిష్కరించండి

బుక్కరాయసముద్రం: రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర నేత, బెటాలియన్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పెద్దయ్య కోరారు. పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితకి వినతిపత్రం అందజేశారు. పోలీసులకు ఎస్ఎల్ఎస్, ఏఎస్ఎల్ఎస్, టీఏ, జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ, మెడికల్ బిల్లులు త్వరగా అందించాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు పెద్దయ్య తెలిపారు.

కాలువ మరమ్మతు పరిశీలన

పుట్లూరు: చింతకుంట సమీపంలో కాలువ కల్వర్టు మరమ్మతు పనులను బుధవారం ఎమ్మెల్యే బండారు శ్రావణి పరిశీలించారు. పనులను త్వరిగతిన పూర్తీ చేసి నీటి సరఫరా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ అధికారులు, రెవిన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు. అలాగే శనగలగూడూరు గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సుకు హాజరైన ఆమె రైతుల నుంచి వచ్చిన పిర్యాదులను త్వరిగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

శుభకార్యం

పామిడి: స్థానిక కోగటం ఫంక్షన్‌హాల్‌లో వైఎస్సార్ సీపీ మండల నేత కొండా రాజశేఖర్ తమ్ముడి కుమార్తె వివాహ రిసెప్షన్ జరిగింది. మాజీ ఎంపీ తలారి రంగయ్య హాజరై నూతన వధూవరులు శీతల్, శైలేష్ బాబును ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి చుక్కలూరు దిలిప్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, నాయకులు హరినాథ్‌రెడ్డి, అడ్వకేట్ రఘునాథ్‌కుమార్ దత్తు, రామ్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, షణ్ముఖ, మున్నా, నాగి,భవాని, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోక్సో కేసుపై విచారణ

గార్లదిన్నె: ముంటిమడుగుకు చెందిన వంశీపై గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు కావడంతో బుధవారం అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన బాలిక పనికి వెళ్లిన గ్రామాలకు వెళ్లి వివరాలు సేకరించారు. ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా ఉన్నారు.